
సాక్షి
తూర్పుగోదావరి
బుధవారం । 31 । మే । 2023



నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు పసువులేటి సుజాత (సికింద్రాబాద్) మంగళవారం రూ.2,00,116 విరాళంగా ఆలయ ఈఓ డి.శ్రీరామవరప్రసాదరావు అందజేశారు.



మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 10,689 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది.

గరిష్టం/కనిష్టం
42.5° / 29.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	42.5	29.0
కాకినాడ	36.1	25.7
అమలాపురం	38.1	27.5

న్యూస్‌రీల్

జూన్ 3,4 తేదీలలో వేసవి స్పెషల్ రైళ్లు

రాజమహేంద్రవరం సిటీ: వేసవి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జూన్ 3,4 (శని,ఆది) తేదీలలో కాచిగూడ–కాకినాడ మధ్య వేసవి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. 3వ తేదీన కాచిగూడ– కాకినాడ టౌన్(07417), 4వ తేదీన కాకినాడ టౌన్–కాచిగూడ (07418) రైళ్లు నడుస్తాయన్నారు. రాజమహేంద్రవరం, సామర్లకోట రైల్వే స్టేషన్లలో ఇవి ఆగుతాయని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రికి ఎక్స్‌రే మెషీన్



ఎక్స్‌రే మెషీన్ అందజేసిన ఓఎన్‌జీసీ అధికారులు

నిడదవోలు : పేద వర్గాల ప్రజలు ఎక్స్‌రే వంటి వైద్య సేవల కోసం కార్పొరేట్ వైద్య కేంద్రాలకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా పొందవచ్చునని రాజమహేంద్రరం ఓఎన్‌జీసీ చీఫ్ మేనేజర్ (జియాలజీ) బీఎస్ఎస్ కృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి శాంతి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఓఎన్‌జీసీ ఆర్థిక సాయంతో రూ.9 లక్షలు విలువైన డిజిటల్ ఎక్స్‌రే మెషీన్ అందజేశారు. డీజీఎం ఎం. వెంకన్న, సీఎస్ఆర్ కోఆర్డినేటర్ వి. శ్రీనివాస్, వైద్యులు సనత్ కుమార్, సూపరింటెండెంట్ ఏవీఆర్ఎస్ తాతారావు, న్యాయవాది నక్కా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


'బంగారుకొండ'తో పౌష్టికాహారం : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ: పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించడం ద్వారా ఆరోగ్యవంతమైన ఎదుగుదల కోసం బంగారుకొండ కార్యక్రమానికి రూపకల్పన చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఆమె మంగళవారం జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బంగారుకొండ అనే సరికొత్త కార్యక్రమం ద్వారా పిల్లల్లో ఆరోగ్యవంతమైన ఎదుగుదల కోసం అడుగులు వేయడం జరుగుతోందన్నారు. మండల స్థాయిలో అనామియా, బలహీనంగా ఉన్న పిల్లలను గుర్తించి వారికి తగిన బలవర్థక ఆహారం అందించాలన్నారు. ఇందుకోసం ఒక నిర్దిష్ట చార్టు రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రతి వారం ఆయా సహజ ఆహార పదార్థాల ముడి సరకును తల్లులకు అందజేసి, పిల్లలు తీసుకునేందుకు వీలుగా అవగాహన అవసరమన్నారు. ఇప్పటికే ఆ తరహా కేటగిరీలో ఉన్న పిల్లల్ని గుర్తించామన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార పథకం కింద సమతుల్య ఆహారం అందిస్తున్నామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ కర్త ఆధ్వర్యంలో చిల్డ్రన్ స్పెషలిస్ట్, న్యూట్రీషియన్ స్పెషలిస్ట్ డాక్టర్ల ఆధ్వర్యంలో ఒక ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పోషక విలువలతో కూడిన ఒక వారం రోజులకు సరిపడే ఆహార పదార్థాలు, వాటికి ఎంత ఖర్చు అవుతుందనే అంశం కీలకం అన్నారు. ఆ మేరకు మూడు నుంచి ఆరు నెలలకు సరిపడే విధంగా దాతల సహకారం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ ఆరు నెలల నుంచి ఏడాది వయసున్న వారికి ఒక కేటగిరీ, ఏడాది పైబడిన వారిని రెండో కేటగిరీగా గుర్తించి బలవర్థక ఆహారం అందించాల్సి ఉంటుందన్నారు.

కల్యాణ తిలకం దిద్దుకున్న బాలాజీ

మామిడికుదురు: వేద మంత్రోచ్చారణలు, భక్తుల గోవిందనామ స్మరణలు, మంగళ వాయిద్యాలు, కర్పూర పరిమళ సుగంధ ద్రవ్యాల సువాసన నడుమ శ్రీబాలబాలాజీ స్వామి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరిగింది. జ్యేష్ఠ శుద్ధ దశమి శుభ ముహూర్తాన పాంచరాత్ర ఆగమానుసారం శ్రీబాల బాలాజీ స్వామి వారి వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రధానార్చకులు మద్దాలి తిరుమలశింగరాచార్యులు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి వారి అర్చక బృందం ఆధ్వర్యంలో శ్రీవారి వార్షిక కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. బాలబాలాజీ స్వామితో పాటు ఉభయ దేవేరుల బుగ్గన చుక్క పెట్టి పెళ్లి కొడుకు, పెళ్లి కుమార్తెలుగా తీర్చిదిద్దారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం, పరిషదక్షిణ, మృత్సంగ్రహణం, అంకురార్పణ, హోమం, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి వైభవోపేతంగా నిర్వహించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈవో డి.శ్రీరామవరప్రసాదరావు పర్యవేక్షణలో కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు.

జై..చిరంజీవ



- అవయవదానంపై అవగాహన అవసరం
- ఒకరి దానంతో 18 మందికి పునర్జన్మ
- బ్రెయిన్ డెత్ కేసుల నుంచి సేకరణకు అవకాశం
- అవగాహన లేమి, అపోహలతో వెనుకంజ

కోరుకొండ మండలానికి చెందిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్తే బతికే అవకాశం ఏమాత్రం లేదన్నారు. క్లినికల్లీ డెడ్‌గా ప్రకటించారు.

అన్నవరానికి చెందిన ఓ ఉద్యోగి ఇటీవల ఇంట్లో పడిపోగా తలకు తీవ్రమైంది. ఆస్పత్రికి తీసుకువెళ్లారు. కానీ బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. ఇంటికి తీసుకు వెళ్లాక రెండు రోజుల్లో కన్నుమూశారు.

రాజమహేంద్రవరం డెస్క్: మరణించాక జీవించవచ్చు అంటారు. బ్రెయిన్ డెత్ సంఘటనల్లో ఇది సాధ్యమే. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బ్రెయిన్ డెత్ కేసులు నమోదవుతున్నాయి. వీరి శరీర అవయవాల ద్వారా ఎందరికో పునర్జన్మ కలిగించవచ్చు. కుటుంబ సభ్యులు కొంచెం చైతన్యంతో వ్యవహరిస్తే ఈ బ్రెయిన్ డెత్ వ్యక్తి ద్వారా మరికొందరికి ప్రాణం పోసిన వారు అవుతారు. కానీ అలాంటి సందర్భాలు అరుదుగానే జరుగుతున్నాయి. కారణం అవయవ దానంపై కనీస అవగాహన లేకపోవడమే. చనిపోయిన వ్యక్తితోపాటే ఎందరికో ఊపిరి నిలిపే అవయవాలు కూడా కాలిబూడిదవుతున్నాయి.

మరణానంతరం బతికే అవకాశం

మనిషి చనిపోయాక కూడా బతికే గొప్ప అవకాశం అవయవదానం ద్వారా లభిస్తుంది. ఇంతటి బృహత్తర కార్యక్రమంపై చాలామంది ఆలోచించడం లేదు. ఫలితంగా ఆస్పత్రుల్లో అవయవదానం కోసం నిరీక్షిస్తున్న వారి సంఖ్య పెరిగిపోతూ ఉంది. పలు కారణాలతో ఏటా లక్షలాది మంది బ్రెయిన్ డెడ్ అవుతున్నా 0.05 శాతం మంది అవయవాలు కూడా సేకరించలేక పోతున్నట్లు వైద్య వర్గాలు చెబుతున్నాయి.

ఎందుకు దూరమవుతున్నారు?

- అవయవ మార్పిడిలో పారదర్శకత కొరవడడం.
- అవయవదానంపై అవగాహనా లోపం, అపోహలు.
- 'జీవన్‌దాన్' వెబ్‌సైట్ ప్రజలకు అందుబాటులో లేకపోవడం.
- ఇచ్చిన అవయవాలు ఎవరికి వెళ్తున్నాయో తెలియక పోవడం.
- ఆత్మలుంటాయి లాంటి విశ్వాసాలతో చాలామంది ముందుకు రావడం లేదు.
- భూమి మీదకు ఎలా వచ్చామో అలాగే వెళ్లిపోవాలి లాంటి భావాలు బలంగా ఉండటం.

దాతలు ముందుకు రావాలంటే..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవయవ మార్పిడి యూనిట్లను అభివృద్ధి చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. 'జీవన్‌దాన్' వెబ్‌సైట్‌ను ప్రజలంతా చూసుకునేలా ఉంచాలి. ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు అనుబంధంగా ఉండే ఆస్పత్రుల్లో అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలను నిర్వహించాలి. పేదలకు అవకాశం లభిస్తుంది. ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యుల ద్వారా మృతుల కుటుంబాల సభ్యులకు కౌన్సెలింగ్ ఇప్పించాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జీవన్‌దాన్ కోఆర్డినేటర్లను నియమించి 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అవయవమార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించాలి.

మహోన్నత ఉద్యమం

తూర్పు గోదావరికి చెందిన గూడూరు సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో విశాఖ కేంద్రంగా అఖిల భారత అవయవ, శరీర దాతల సంఘం పనిచేస్తోంది. రాష్ట్రమంతా అవగాహన పెంచడానికి ఈ సంఘం కృషి చేస్తోంది. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వంతుగా అవగాహన కల్పించే బాధ్యతను మెప్మాకు అప్పగించింది.

18 మందికి వెలుగు

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలను 18 మందికి మార్పిడి చేయడం ద్వారా వారి జీవితాల్లో వెలుగు నింపవచ్చు. గుండె, రెండు జతల కవాటాలు, కిడ్నీలు, కళ్లు, కాలేయం, ఊపిరితిత్తులు, క్లోమం, ప్రాంకియాసిస్, కర్ణభేరి, గాల్‌బ్లేడర్, యూరినరీ బ్లేడర్, చర్మం, ఎముకలు, కండరాలు, ఎముకల్లోని మజ్జ సేకరించవచ్చు. బతికున్న వారి నుంచి రక్తం, కిడ్నీ, కాలేయం (మూడింట ఒక భాగం) సేకరించవచ్చు. కిడ్నీ, కాలేయం రక్త సంబంధీకుల నుంచి తప్ప ఇతరుల నుంచి సేకరించరాదని నిబంధనలు చెబుతున్నాయి.

అవయవ దానం ఇలా..

అవయవదానం చేయాలంటే తమ సమ్మతిని తెలియజేస్తూ మెడికల్ కళాశాలకు విల్లు రాయాల్సి ఉంటుంది. దీనిని ఇద్దరు వారసులు..మరో ఇద్దరు సాక్షులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించాలి. దానిని తరువాత రిజిస్టర్ చేసి మెడికల్ కళాశాలకు అందించాలి. ఆ వ్యక్తిని గుర్తించి దాతగా మెడికల్ కళాశాల గుర్తింపుకార్డును జారీ చేస్తుంది. జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లోగాని ..ఏదైనా స్వచ్ఛంద సంస్థ ద్వారా గాని అవయవదాతగా నమోదు చేసుకునే అవకాశం కూడా ఉంది. సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్..చారిటబుల్ సంస్థ దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని రాజమహేంద్రవరానికి చెందిన ఆ సంస్థ ట్రస్టీ మధుసూదన్ చెప్పారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను కొద్ది గంటల్లోనే సేకరించాల్సి ఉంటుందన్నారు.

టాప్ దేశాలివి

ప్రతి పది లక్షల మందికి అవయవదానం చేస్తున్న వారి రేటు ఎలా ఉందో ఈ కింది దేశాలను చూస్తే అర్థం అవుతుంది. అత్యధికంగా స్పెయిన్ దేశంలో ప్రతి 10లక్షల మందికి 46.90 శాతం మంది అవయవ దానం చేస్తున్నారు.

స్పెయిన్	:	46.90
పోర్చుగల్	:	34.01
బెల్జియం	:	33.62
క్రోయోషియా	:	33
యూఎస్	:	31.96
భారత్	:	0.58

శ్రీలంక తరహాలో 'కళ్లు' తెరవాలి



మా అమ్మ చనిపోతే మృతదేహాన్ని జీఎస్ఎల్ మెడికల్ కాలేజీకి అందజేశాం. ఇప్పటివరకూ గౌతమి నేత్రాలయకు 142 మంది కార్నియాలు సేకరించాం. జిల్లాలో 52 మంది శరీర దానానికి అంగీకరించగా 8 శరీరాలను వైద్య కళాశాలకు అందజేశాం. మన జిల్లాలో అవయవ దానంపై విస్తృత అవగాహన రావాల్సి ఉంది. ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 14వేల మంది కార్నియా కోసం ఎదురుచూస్తున్నారు. ప్రజలు అపోహలు వీడాలి. శ్రీలంక తరహాలో మనిషి చనిపోతే వెంటనే నేత్రదానం చేయాలి.

– మధుసూదనరావు, సావిత్రిబాయి ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు, రాజమహేంద్రవరం

ఆస్పత్రుల్లో కౌన్సిలర్‌ను నియమించాలి



అవయవ దానానికి సంబంధించి ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. ఆరోగ్య శ్రీ పరిధిలోకి అవయవ మార్పిడి తీసుకువస్తే సామాన్యులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ రాశాం. జిల్లా ఆస్పత్రుల్లో అత్యవసర చికిత్సకు వచ్చి చనిపోయిన వారుంటారు. వారి కుటుంబాలతో మాట్లాడి అవయవ దానం గురించి వివరించాలి. ఇందుకు ఒక కౌన్సిలర్‌ను నియమిస్తే చాలా బాగుంటుంది.

– గూడూరు సీతామహాలక్ష్మి, అఖిల భారత అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు

ఆ వెసులుబాటుకు చర్యలు



వెలకట్టలేని విలువున్న అవయవాలెన్నో వ్యక్తి మరణంతో మట్టిలో కలిసిపోతున్నాయి. మరోవైపు అవయవాల పనితీరు లోపించి, మరో అవయవం దొరకక యువతతో సహా పెద్దల వరకు ఎన్నో ప్రాణాలు కళ్లముందే పోతున్నాయి. కాకినాడ జిల్లాలో పలు కార్పొరేట్ ఆసుపత్రులలో అవయవ దానం, సేకరణ రెండింటికీ వెసులుబాటు ఉంది. ప్రభుత్వ కళాశాల, ఆసుపత్రుల్లో ఆ వెసులుబాటుకు తగిన చర్యలు చేపడుతున్నాం. ఆర్గాన్ రిట్రైవల్ (సేకరణ) కేంద్రం ఏర్పాటుకు ముందుగా పలు ప్రమాణాలు వృద్ధి చెందాలి.

– డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, ప్రిన్సిపల్ ఆర్ఎంసీ, డీఎంఈ, కాకినాడ

కైవల్యరెడ్డికి మంత్రి బొత్స అభినందన



కైవల్యరెడ్డిని అభినందిస్తున్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

నిడదవోలు: ప్రతిష్టాత్మక అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా నిర్వహించే అంతర్జాతీయ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రామ్ (ఐఏఎస్‌పీ) 2023కు ఎంపికైన నిడదవోలు విద్యార్థిని కుంచాల కైవల్యరెడ్డి తన తల్లిదండ్రులతో కలసి విజయవాడలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను మంగళవారం కలుసుకుంది. ఈ సందర్భంగా ఇస్రోకు ఎంపికైన విధానాన్ని కైవల్యరెడ్డి మంత్రి బొత్స సత్యనారాయణకు వివరించింది. మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ అతి చిన్న వయసులో నాసా అంతర్జాతీయ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రామ్‌కు ఎంపిక కావడం ఎంతో గర్వకారణమన్నారు. 15 ఏళ్లలోనే ఈ అరుదైన ఘనత సాధించిన కైవల్యరెడ్డిని ఆయన అభినందించారు. అమెరికాలో అలబామాలో అందించే ఆస్ట్రోనాట్స్ శిక్షణ పూర్తిచేసి ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం నుంచి ఆమెకు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కైవల్యరెడ్డి వెంట తల్లిదండ్రులు శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మి ఉన్నారు.

ఆర్కియాలజీ మ్యూజియం నిర్మాణానికి నిధులు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో ఎంపీ గీత భేటీ

కాకినాడ: కాకినాడ ఆర్కియాలజీ మ్యూజియం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఎంపీ వంగా గీత విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఢిల్లీలో ఆయన్ను కలిసి లేఖను అందజేశారు. ఆ లేఖ ప్రతులను మీడియాకు విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.10 కోట్ల అంచనాతో ప్రతిపాదించిన ప్రాజెక్టును త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. అన్నవరం ప్రసాద్ స్కీంకు పరిపాలనా మోదం మంజూరు చేయాలని, సర్పవరం భావన్నారాయణ స్వామి అభివృద్ధికి సహకరించాలని ఎంపీ గీత మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు.

ఘనంగా నాలుగేళ్ల సంబరం

- ఉత్సాహంగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- ఊరూ వాడా పండగ వాతావరణం
- కొవ్వూరులో పాల్గొన్న హోం మంత్రి తానేటి వనిత



కొవ్వూరు క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

సాక్షి, రాజమహేంద్రవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటాయి. మంత్రి, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పలు చోట్ల జెండా ఆవిష్కరించారు.

- కొవ్వూరులో హోం మంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో నాలుగేళ్ల సంబరాలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేసి సీఎం వైఎస్ జగన్ పేదలు, అణగారిన వర్గాలకు చేస్తున్న మేలును వివరించారు.
- రాజానగరంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజనల్ కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ నేతృత్వంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ రాజానగరం నుంచి వివిధ గ్రామాల మీదుగా సాగింది. పార్టీ జెండాలు పట్టుకుని 'జై జగన్' అని నినాదాలు చేశారు. జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలిచారన్నారు. మిగిలిన రాష్ట్రాలు, నాయకులు ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా సంక్షేమ విప్లవం తీసుకొచ్చారన్నారు.
- నిడదవోలులో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో నాలుగేళ్ల సంబరాలు వైభవంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు. సీఎం జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. సంక్షేమ పథకాలు ఇంటి వద్దకు చేరుస్తున్న ఘనత ఆయనకే దక్కిందన్నారు.
- ద్వారకాతిరుమలలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. నాలుగేళ్ల పాలన స్వర్ణయుగమన్నారు. దేశానికి ఏపీ ఆదర్శంగా నిలిచిందని, అందుకు సీఎం కష్టం వెలకట్టలేనిదన్నారు. అనంతరం కార్యకర్తలకు కేక్ తినిపించారు.

పాల సేకరణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక

కలెక్టర్ మాధవీలత



దేచెర్లలో త్రివేణి రెన్యూవేబుల్ గ్లాస్ పరిశ్రమను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, పరిశ్రమ ఎండీ వరుణ్‌గుప్తా

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో పాల సేకరణకు ఆస్కారమున్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జగనన్న పాల వెల్లువపై పశు సంవర్ధక, డీఆర్‌డీఏ సహకార శాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పాడి పరిశ్రమకు చక్కటి అవకాశం ఉందన్నారు. ఆమేరకు గ్రామస్థాయిలో పాడి రైతుల్లో అవగాహన కలిగించాలన్నారు. అమూల్ సహకర సంస్థకు పాల సేకరించడంలో అనుసంధాన కర్తగా వ్యవహరించి రైతులకు అధిక ప్రయోజనం కల్పించాలన్నారు. జిల్లాలో 10 మండలాల పరిధిలో 73 గ్రామాల్లో 37 వేల పాడి పశువుల ద్వారా 1.83 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. స్థానిక అవసరాలు, ప్రయివేటు వెండర్స్ 1.38 లక్షల లీటర్లు సేకరించినా ఇంకా 45 వేల లీటర్ల పాలు సేకరించేందుకు అవకాశం ఉందన్నారు. పాల సేకరణకు గ్రామ స్థాయిలో డీఆర్‌డీఏ, సహకార సంస్థలతో పశు సంవర్ధక సచివాలయ సిబ్బందితో సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. రైతుల్లో ప్రేరణ కలిగించాలన్నారు. నల్లజర్ల, గోపాలపురం, దేవరపల్లి, తాళ్లపూడి గ్రామాలలో పాల సేకరణ కోసం డీసీఎం ద్వారా సమావేశం నిర్వహించాలన్నారు. రాజానగరం నియోజకవర్గంలో కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలతో పాటు రంగంపేటలో జేపీవీ ప్రోగ్రాం విస్తరణకు కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, సహాయ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా పశు సంవర్ధక అధికారి డా ఎస్‌జిటి సత్య గోవింద్, డీఆర్‌డీఏ పీడీ సుభాషిణి, కో ఆపరేటివ్ అధికారి ఎంవీవీ నాగభూషణం, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమలతో యువతకు ఉపాధి అవకాశాలు

కొవ్వూరు: జిల్లాలో పారిశ్రామిక ప్రగతి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కె.మాధవీలత వెల్లడించారు. దేచెర్లలో కొత్తగా నిర్మించిన త్రివేణి రెన్యూవేబుల్ గ్లాస్ పరిశ్రమను మంగళవారం ఆమె పరిశీలించారు. రూ.1,350 కోట్లతో నిర్మిస్తున్న ఈ పరిశ్రమ ద్వారా 2,400 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ పరిశ్రమకు అవసరమైన మౌలిక సదుపాయాలపై కంపెనీ ప్రతినిధులు కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌గుప్తా మాట్లాడుతూ గ్లాస్ పరిశ్రమకు పునరుత్పత్తి సామర్థ్యం ఉంటుందన్నారు. గ్లాస్ ఉత్పత్తి విధానం గురించి కలెక్టర్‌కు ఆయన వివరించారు. ఉత్పత్తి ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. త్వరలోనే పరిశ్రమ పూర్తి సామర్థ్యంతో పనిచేస్తుందని తెలిపారు. జిల్లా పరిశ్రమల అధికారి బి.వెంకటేశ్వరరావు, ఆర్డీఓ ఎస్.మల్లిబాబు, పంచాయతీరాజ్ ఎస్ఈ ఏబీవీ ప్రసాద్, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, సర్పంచ్ గోశాల నాగార్జున, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

సర్వర్లు డౌన్... నిలిచిన రిజిస్ట్రేషన్లు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జనం నిరీక్షణ



కార్యాలయంలో పనిచేయని ఆన్‌లైన్ సేవలు

- రెండు రోజులు ఆగిన కార్యకలాపాలు
- మంగళవారం రాత్రి తొలగిన సాంకేతిక అడ్డంకి
- నేటి నుంచి యథాతథంగా రిజిస్ట్రేషన్లు

కొవ్వూరు: సర్వర్లు డౌన్ కావడంతో రెండు రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. సోమవారం ఉదయం నుంచి సర్వర్లు పనిచేయకపోవడంతో సమస్య ఏర్పడినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజుకు సరాసరి 300 నుంచి 400 రిజిస్ట్రేషన్లు చేస్తుంటారు. వీటి ద్వారా రోజుకు సుమారు రూ.కోటికి పైగా ఆదాయం సమకూరుతుంది. రెండు రోజుల నుంచి రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో ఎక్కడి డాక్యుమెంట్లు అక్కడే నిలిచిపోయాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద జనం పడిగాపులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు నిలిచిపోవడంతో ఆ శాఖకు రూ.2 కోట్ల నుంచి రూ.2.5 కోట్ల మేరకు ఆదాయానికి గండి పడింది. జూన్ నుంచి భూముల ధరలు పెరుగుతుండడంతో రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయి. ఇటువంటి తరుణంలో సాంకేతిక పరమైన సమస్యతో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అంతరాయం కలగింది. మంగళవారం రాత్రి నుంచి సర్వర్ యథాతథంగా పని చేస్తోందని జిల్లా రిజిస్ట్రార్ కె.ఆనందరావు తెలిపారు. సాంకేతిక సమస్య పరిష్కారమైందన్నారు. బుధవారం నుంచి రిజిస్ట్రేషన్లు ఎప్పటిలాగే సాగుతాయన్నారు.

క్లుప్తంగా

అదృశ్యం కేసు హత్య కేసుగా మార్పు


వెంకటరామారెడ్డి (ఫైల్)

మండపేట: పట్టణంలో సంచలనం కలిగించిన ధాన్యం కమీషన్ వ్యాపారి అదృశ్యం కేసును మంగళవారం పోలీసులు హత్యకేసుగా మార్పుచేశారు. ఆ దిశగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పి.శివ గణేష్ తెలిపారు. స్థానిక బ్యాంకు కాలనీకి చెందిన ధాన్యం కమీషన్ వ్యాపారి గొలుగూరి వెంకటరామారెడ్డి ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం సమయంలో బాకీ వసూలు నిమిత్తం రావూరి సూర్యనారాయణ వద్దకు వెళుతున్నట్టు చెప్పి ఇంటికి తిరిగిరాలేదు. అదే రోజు రాత్రి ఆయన భార్య శ్వేతనాగదేవి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి నాలుగు రోజులుగా అన్ని కోణాల్లోను దర్యాప్తు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఆయన మోటారు సైకిల్‌ను స్థానిక బైపాస్ రోడ్డులో పోలీసులు గుర్తించారు. వివాద రహితునిగా వెంకటరామారెడ్డికి మంచి పేరుంది. ఆయన క్షేమంగా ఇంటికి తిరిగిరావాలని అతని కుటుంబ సభ్యులు, సన్నిహితులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. కాగా రామారెడ్డిని హత్యచేసి పశువుల మకాం వద్ద పూడ్చిపెట్టారన్న ప్రచారం జరుగుతోంది. అనుమానితులను పోలీసుల అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. కాగా పోలీసులు ఏమీ ధృవీకరించ లేదు.

నేడు పీజీటీ పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్

రాయవరం/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో హైస్కూల్ ప్లస్‌లో ఖాళీ పోస్టులకు బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 321 పీజీటీ పోస్టులను భర్తీ చేస్తున్న విషయం పాఠకులకు విదితమే. ఇప్పటి వరకు జరిగిన కౌన్సెలింగ్‌లో పలువురు స్కూల్ అసిస్టెంట్లు వారికి ఆసక్తి ఉన్న సబ్జెక్టుల్లో పీజీటీ పోస్టులకు ఎంపికయ్యారు.

ఇంకా మిగిలి ఉన్న తెలుగు–2, గణితం–1, ఫిజిక్స్–18, కెమిస్ట్రీ–18, బోటనీ–14, జువాలజీ–12, సివిక్స్–4, కామర్స్–1, ఎకనామిక్స్–1 పీజీటీ పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. కళాశాలల వారీగా, సబ్జెక్టుల వారీగా ఖాళీలను డీఈవోఈజీ.ఓఆర్‌జీ వెబ్ సైట్‌లో పొందుపర్చినట్లు డీఈవో కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడే పట్టాభిషేకం

- జేఎన్‌టీయూ కాకినాడ 9వ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు
- హాజరుకానున్న వర్సిటీ కులపతి, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): బీటెక్ నాలుగేళ్లు, ఎంటెక్ రెండేళ్లు పూర్తి చేసినందుకు గుర్తింపుగా చేసే పట్టాల ప్రదాన వేడుకలకు జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ వేదిక అవుతోంది. వివిధ రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలలో ఉన్న వారికి సైతం పట్టా అందుకోవడానికి ఆహ్వానాలు పంపి అతిరథ మహారథుల చేతుల మీదుగా అందజేయనున్నారు. స్నాతకోత్సవ సందర్భంగా సంప్రదాయ వస్త్రధారణలో పట్టా(ఒరిజినల్ డిగ్రీ) తీసుకోవడానికి ఏర్పాట్లు చేసింది. జీవితంలో మధురానుభూతిగా నిలిచే ఈ వేడుకలకు అర్హులైనవారు తమ వివరాలు వర్సిటీకు పంపించారు. గత ఏడాది డిసెంబర్‌లో స్నాతకోత్సవం నోటిఫికేషన్ జారీచేసి గవర్నర్ అనుమతితో బుధవారం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. 9వ స్నాతకోత్సవాన్ని రెండు సంవత్సరాలకు కలిపి ఒకేసారి నిర్వహిస్తున్నారు.


చలమలశెట్టి అనిల్, గ్రీన్ కో గ్రూప్ వ్యవస్థాపకులు

2020–21, 2021–22కు సంబంధించి రెండు సంవత్సరాల అకడమిక్ ఇయర్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అందజేస్తున్నారు. స్నాతకోత్సవంలోభాగంగా బీటెక్ విభాగంలో 107,595, బీఆర్క్ 124 ,బీఫార్మసీ 3,835, ఎంటెక్ 3,535, ఎంబీఏ 3,348, ఎంసీఏ 989, ఎం.ఫార్మసీ 645, బీబీఏ 33, ఫార్మడీ 468, బీఆర్క్ 124 ఎంఎస్ఐటీ 02 , ఒడీలు (ఒరిజినల్ డిగ్రీ) విద్యార్థులు పొందనున్నారు. వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ చూపిన వారికి 66 బంగారు పతకాలు, 144 పీహెచ్‌డీలు అందజేయనున్నారు.

గ్రీన్‌కో ఫౌండర్ అనిల్‌కు గౌరవ డాక్టరేట్..
ఈ ఏడాది స్నాతకోత్సవం సందర్భంగా గ్రీన్ కో గ్రూప్ వ్యవస్థాపకుడు చలమలశెట్టి అనిల్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన చలమలశెట్టి అనిల్ యూకేలో నార్త్ వెస్ట్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ చేశారు. ఏపీ యంగ్ ఎంటర్ ప్రెన్యూర్ ఆఫ్‌ది ఈయర్, సౌత్ ఇండియా బిజినెస్ అచీవర్ వంటి ప్రతిష్టాత్మక అవార్డులు సాధించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ ఎనర్జీ ఫోరమ్‌లకు నాయకత్వం వహిస్తున్నారు. 2006లో గ్రీన్ కో క్లీన్ ఎనర్జీ కంపెనీ అయిన గ్రీన్‌కో గ్రూప్ స్థాపించి భారతీయ ఇంధన రంగంలో తనదైన ముద్ర వేశారు. శాంత బయోటెక్ అధినేత పద్మభూషణ్ డాక్టర్ కేఐ వరప్రసాదరెడ్డి, విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి హాజరవుతున్నారని వర్సిటీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, పీఆర్‌ఓ సీహెచ్ సాయిబాబు మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు.



స్నాతకోత్సవ వివరాలు వెల్లడిస్తున్న వర్సిటీ వీసీ డాక్టర్ ప్రసాదరాజు

ప్రజలకు మెరుగైన సేవలు

ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది

కరప: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మరింతగా మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి, జగనన్నకు చెబుదాం, సంక్షేమ పథకాల పర్యవేక్షణాధికారి గోపాలకృష్ణ ద్వివేది తెలిపారు. మండల పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన కలెక్టర్ కృతికాశుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా ఇతర అధికారులతో కలసి కరప రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఆరా తీశారు. మండల పరిధిలో ఎంత విస్తీర్ణంలో రబీ సాగు చేశారు, ఇంతవరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు, రైతులకు మద్దతు ధర అందుతోందా అని ఆరా తీశారు. వీఏఏ ప్రశాంత్, పీఏసీఎస్ ప్రతినిధి డి.తమాదేవి రైతుల వద్ద ధాన్యం సేకరించి రైసుమిల్లుకు పంపే వరకు క్రమం వివరించి చెప్పారు. రసాయనిక, ఎరువులు, పురుగుమందులు సార్వాకు అందుబాటులో ఉంచిన విషయాన్ని ఏడీఏ కె.బాబూరావు వివరించారు. ఇంతవరకు ఎన్ని మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసిందీ, రైతులకు ఎంత సొమ్ము చెల్లించిందీ కలెక్టర్ కృతికశుక్లా సీఎస్ గోపాలకృష్ణ ద్వివేదికి వివరించారు.

జిల్లాకు మూడో ర్యాంకు
గోపాలకృష్ణ ద్వివేది విలేకరులతో మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం అమలులో రాష్ట్రంలో కాకినాడ జిల్లా మూడోర్యాంకులో ఉందన్నారు. కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు గ్రామానికొక ప్రత్యేకాధికారిని నియమించాలని కలెక్టర్‌కు సూచించారు. కాకినాడ భానుగుడి సెంటర్‌లో ఆర్టీసీ బస్‌స్టాప్ తీసేశారని, దానివల్ల ఆసుపత్రుల కెళ్లే రోగులు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని గ్రామస్తులు తెలుపగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. వ్యవసాయశాఖ ద్వారా అమలు చేయనున్న డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీని డెమో చేసి చూపించారు. ఆర్డీఓ బీవీ రమణ, జిల్లా సివిల్ సప్‌లై మేనేజర్ డి.పుష్పమణి, జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఎస్.విజయ్‌కుమార్, ఏడీఏ కె.బాబూరావు పాల్గొన్నారు.


కరపలో డ్రోన్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి గోపాలకృష్ణద్వివేది, కలెక్టర్ కృతికాశుక్లా

అదనపు కట్నం వేధింపులపై కేసు

కొత్తపల్లి: అదనపు కట్నం కోసం వేధిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఉప్పాడకు చెందిన మైలపల్లి ఆశాజ్యోతికి సూర్యారావుపేటకు చెందిన తాతారావుతో నాలుగు సంవత్సరాల క్రితం వివాహమైంది. కొంతకాలంగా అదనపు వరకట్నం కోసం భర్త తాతారావు, అత్త నూకరత్నం, ఆడపడుచు పేర్ల బంగారి వేధిస్తున్నారని ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రామలింగేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లోవలో ఆధ్యాత్మిక శోభ

- ఘనంగా జీర్ణోద్ధరణ ప్రతిష్టా మహోత్సవాలు
- కావిళ్లతో చీర, సారెలు తెచ్చిన తాళ్లూరు గ్రామస్తులు


చీర, సారెతో వచ్చిన మహిళకు స్వాగతం పలికి సారె కావిడిని స్వీకరిస్తున్న ఈఓ విశ్వనాథరాజు


లోవకు చీర, సారెతో బయలుదేరిన తాళ్లూరు గ్రామస్తులు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి లోవ జీర్ణోద్ధరణ ప్రతిష్ఠా మహోత్సవాలతో దేవస్థానం ప్రాంగణం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ నెల 27 నుంచి 31 వరకు లోవ జీర్ణోద్ధరణ ప్రతిష్ఠా మహోత్సవాలు జరుగుతున్నాయి. వేద పండితులు, రుత్వికులు, ప్రధాన అర్చకులు, అర్చకులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మంగళవారం చతుర్వేద, చండీ పారాయణలు, చండీ హోమం, పూర్ణాహుతి, దాన్యాధివాసం, పంచశయ్యాధివాసములు, అష్టదిగ్బలులు, నీరాజన మంత్రపుష్పములు, తదితర కార్యక్రమాలు, పూజలు నిర్వహించారు.

కావిళ్లతో చీర, సారెలు : గ్రామ దేవత తలుపులమ్మ అమ్మవారు కావడంతో తాళ్లూరు గ్రామస్తులు చీర, సారెలు సమర్పించారు. పిండివంటలు తయారు చేసి వందలాది మంది దంపతులు కావిళ్లతో కాలినడకన లోవ దేవస్థానికి చేరుకుని అమ్మవారికి చీర, సారెలను సమర్పించారు. చీర, సారెతో తరలివచ్చిన తాళ్లూరు గ్రామస్తులకు కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు, ఛైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు స్వాగతం పలికారు. కావిళ్లను అందిపుచ్చుకుని అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న మహిళలకు దేవస్థానం తరపున పసుపు, కుంకుమ, గాజులు, రవిక, ప్రసాదాలను ఈఓ అందజేశారు.

నేటి కార్యక్రమాలు
లోవ జీర్ణోద్ధరణలో భాగంగా బుధవారం ఉదయం 5.30 గంటల నుంచి ప్రాతఃకాల వేదికా సంస్కారములు, జీర్ణోద్ధరణ సంస్కారములు, రత్నన్యాస, గర్తన్యాస, ధాతున్యాస బీజన్యాసములు నిర్వహిస్తారు. జ్యేష్ఠ ఏకాదశి, చిత్తా నక్షత్రయుక్త మిధున లగ్నమందు ఉదయం 8.16 గంటలకు తలుపులమ్మ అమ్మవారి జీర్ణోద్ధరణ పునఃప్రతిష్ఠా మహోత్సవాలను రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, లక్ష్మీచైతన్య దంపతులు నిర్వహిస్తారని ఈఓ తెలిపారు. గోదర్శనం, మహాపూర్ణాహుతి, దీక్షా విమోచనం, ఆశీర్వచనములతో జీర్ణోద్ధరణ మహోత్సవాలు పూర్తవుతాయన్నారు.



కాకినాడలో వేగ జ్యువెలరీ ఎగ్జిబిషన్



కాకినాడ నాగమల్లితోట జంక్షన్ హెలికాన్ టైమ్స్‌లో ఏర్పాటు చేసిన వేగ జ్యువెలరీ ప్రదర్శన

కాకినాడ: సౌత్ ఇండియాలోనే అతి పెద్ద వెడ్డింగ్ జ్యువెలరీగా వినుతికెక్కిన వేగ జ్యువెలరీ మంగళ, బుధవారాల్లో కాకినాడలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసింది. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రజాప్రతినిధి పిల్లి అనంతలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు వనమా నవీన్, వనమా సుధాకర్ మాట్లాడుతూ మంగళప్రదమైన కార్యక్రమాలు, వేడుకలు, వివాహాది కార్యక్రమాలకు కావాల్సిన విశిష్ట ఆభరణాలను ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశామని తెలిపారు. పోల్కీ జ్యువెలరీపై ఎటువంటి మేకింగ్, వేస్టేజ్ చార్జీలు లేవన్నారు. రూ.2 లక్షల బంగారం, వజ్రాలు కొనుగోలుపై గ్రాము గోల్డ్ కాయిన్ ఉచితంగా అందిస్తున్నామని తెలియచేశారు. ఆభరణాల ప్రియులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. తమకు కావాల్సిన ప్రసిద్ధ ఆభరణాల కోసం దేశంలోని పలు ప్రాంతాలకు తిరిగే శ్రమ లేకుండా దేశం నలుమూలల నుంచి ప్రముఖ డిజైనర్స్ రూపొందించిన ఎన్నో రకాల ఆభరణాలు ఈ ప్రదర్శనలో ఉంచామని తెలిపారు. తమ వేగ జ్యువెలరీ బ్రాండ్ షోరూమ్‌లను తెలుగు రాష్ట్రాల్లోని మరికొన్ని నగరాలకు విస్తరించే ప్రతిపాదన ఉందని ప్రతినిధులు తెలిపారు.

లేబుల్స్ మార్చి యానాం మద్యం విక్రయం


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలను మీడియాకు చూపుతున్న సెబ్ బృందం

కాకినాడ క్రైం: లేబుల్స్ మార్చి యానాం మద్యాన్ని అక్రమంగా తరలించి కాకినాడ జిల్లాలో పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్న నిందితులను సెబ్ బృందం అదుపులోకి తీసుకుంది. సెబ్ ప్రత్యేక అధికారి ప్రేమ్‌కాజల్ కాకినాడలోని నాగమల్లితోట సమీపంలో ఉన్న సెబ్ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆమె మాట్లాడుతూ కాకినాడ గ్రామీణ మండలం తిమ్మాపురానికి చెందిన కర్రి రాజ, కర్రి విజయ్, రామారావుపేటకు చెందిన గంపల నాగవెంకట జ్ఞానేశ్వర్ కుమార్, గైగోలుపాడుకు చెందిన పాలిక రాజేష్, యానాం పుదుచ్చేరికి చెందిన దువ్వారపు శివప్రసాద్ కొంతకాలంగా యానాం నుంచి భారీగా మద్యాన్ని తరలించి స్థానిక స్టిక్కర్లు అంటించి విక్రయాలు చేపడుతున్నారన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుల్లో దువ్వారరపు శివప్రసాద్ పరారీలో ఉన్నాడని తెలిపారు. నిందితుల నుంచి రూ.లక్షా 7వేలు విలువ చేసి 1,337 యానాం మద్యం సీసాలను 4,177 నకిలీ స్టిక్కర్లను, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

పీఆర్వో, రిసెప్షన్ కార్యాలయాల మార్పునకు రంగం సిద్ధం

అన్నవరం: రత్నగిరిపై శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో పీఆర్వో, రిసెప్షన్ కార్యాలయాలను రామాలయం పక్కన గల అకౌంట్స్ సెక్షన్‌కు మార్చేందుకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం ఇవి సర్క్యులర్ మంటపంలో ఉన్నాయి. అయితే ఇవి అక్కడ తొలగిస్తే ఆ మంటపం విశాలమవుతుందని ఈఓ భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అకౌంట్ సెక్షన్‌లో ఒక రూమ్ రిసెప్షన్, ఇంకో రూమ్ పీఆర్వో కార్యాలయంగా మార్చుతారు. అకౌంట్స్ సెక్షన్‌ను ప్రకాష్ సదన్ వద్ద గల అడ్మినిస్ట్రేటివ్ భవనంలోకి మార్చుతారు. ఈ మార్పులన్నీ త్వరలోనే అమలు చేయాలని ఈఓ ఆదేశించినట్టు తెలిపారు.

ఘనంగా వన మహోత్సవం

- 3.90 ఎకరాల్లో నాలుగు వేల మొక్కలు
- మారేడుతోబాటు తులసి, అరటి, మామిడి కూడా


మారేడు మొక్కకు మొక్కుతున్న ఈఓ చంద్రశేఖర్ అజాద్

అన్నవరం: స్థానిక శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి అన్నవరం రైల్వేస్టేషన్ సమీపంలో గల 3.90 ఎకరాల బీడు భూమి త్వరలోనే సత్యదేవుని పూజలకు ఉపయోగించే మారేడు, తులసి వనంగా మారనుంది. ఈ భూమిలో మంగళవారం వన మహోత్సవం పేరుతో సుమారు నాలుగు వేల మొక్కలు నాటే కార్యక్రమానికి ఈఓ చంద్రశేఖర్ అజాద్ శ్రీకారం చుట్టారు. ఈ భూమి కౌలు రైతు అధీనంలో ఉండేది. 2016లో దేవస్థానం స్వాధీనం చేసుకుంది. ఆ తరువాత ఆ భూమిలో సోలార్ విద్యుత్ పంప్‌ల ద్వారా దేవస్థానానికి సొంతంగా కూరగాయలు సాగు చేశారు. అయితే ఆ పంప్ సెట్స్ పాడవడంతో ఆ భూమి నిరుపయోగంగా మారింది. కాగా, ఇటీవల మళ్లీ ఆ పంప్‌లకు మరమ్మతులు నిర్వహించి సోలార్ విద్యుత్ ద్వారా నీరు వచ్చేలా చేశారు.

పత్రికి కొరత లేకుండా...
ఈఓగా చంద్రశేఖర్ అజాద్ బాధ్యతలు స్వీకరించాక వనమహోత్సవం పేరుతో దేవస్థానం భూమిలో మారేడు, తులసి, జమ్మి తదితర మొక్కలను నాటుతున్న విషయం తెలిసిందే. గత నెల 27వ తేదీన స్థానిక జాతీయ రహదారి పక్కనే దేవస్థానానికి గల 4.25 ఎకరాల భూమిలో మారేడు, తులసి, జమ్మి తదితర మొక్కలను నాటారు. అదే ఒరవడితో రైల్వేస్టేషన్ వద్ద గల భూమిలో కూడా మంగళవారం మొక్కలు నాటారు. ఈఓ తొలుత మారేడు మొక్కలకు పూజలు చేశారు. అనంతరం ఆలయ సిబ్బంది, పురోహితులు, అర్చకులు, వ్రత పురోహితులు తలో ఒక మొక్క నాటారు. సుమారు ఆరు అడుగుల ఎత్తు గల మొక్కలను, మొక్కకి మొక్కకి మధ్య ఎనిమిది అడుగుల ఖాళీ ఉండేలా నాటారు. వారం రోజుల పాటు సాగే కార్యక్రమంలో 300 మారేడు మొక్కలతో బాటు 3,500 తులసి, 15 మామిడి, పది ఉసిరి, 200 అరటి, మొక్కలను నాటనున్నట్లు వివరించారు. అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు, వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠీ, చిట్టి శివ, ముష్టి పురుషోత్తం, ఆలయ ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, వ్రతపురోహిత సంఘం అధ్యక్షుడు రవిశర్మ పాల్గొన్నారు.

మట్టి లారీల సీజ్

కపిలేశ్వరపురం: గ్రామ శివారులో రైతుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న ఘటనపై అధికారులు స్పందించారు. మట్టిని తరలిస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఎస్ఈబీ, రెవెన్యూ, అంగర పోలీసు అధికారులు మంగళవారం ఘటనా స్థలానికి చేరుకుని మూడు మట్టి లారీలు, రెండు జేసీబీలను సీజ్ చేశారు. లారీలను అంగర పోలీసు స్టేషన్‌కు తరలించి గనులశాఖ అధికారులకు నివేదించినట్టు తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎస్సై జి.చంటి తెలిపారు.

గాయత్రీ మాతకు 1,008 మామిడి పండ్లతో అభిషేకం

అమలాపురం టౌన్: స్థానిక ఎర్ర వంతెన వద్ద గల వేద మాత గాయత్రి దివ్యభవ్య సాధన మందిరంలో అమ్మవారి జన్మదినోత్సవం, ఆలయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగాయి. అమ్మవారికి 1,008 మామిడి పండ్లతో అభిషేకం కన్నుల పండువగా సాగింది. హైదరాబాద్ మహీ వారహ ట్రస్ట్ ఛైర్మన్ కుందుర్తి మహీ కిరణ్‌శర్మ పర్యవేక్షణలో మామిడి పండ్ల అభిషేకం జరిగింది. పట్టణానికి చెందిన పది మంది పిల్లలు అమ్మవారి కీర్తనలతో చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వేలాది మంది భక్తులు తరలివచ్చారు. వారం రోజుల పాటు గీతాశ్రమంలో లక్ష గో పిడకలతో జరిగిన శ్రీ సురభి– గోరక్ష దీక్షా యాగం సోమవారం రాత్రితో పూర్ణాహుతితో ముగియగానే అమ్మవారి జన్మ దినోత్సవ పూజాదికాలు మొదలయ్యాయి. వేద మాత గాయత్రి దివ్య భవ్య సాధన మందిర ట్రస్టీ ఛైర్మన్ ఆకుల బాబి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో ట్రస్ట్ కోశాధికారి కోకా రాంబాబు, కోశాధికారి ఆకుల శ్రీదేవి భక్తులకు సేవలు అందించారు.


మామిడి పండ్ల అభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణలో అమ్మవారు